

నల్లగొండలో జెండా ఊపి కొత్త బస్సును ప్రారంభిస్తున్న మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్


నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, ఆదివారం 14 జూలై 2024 | NALGONDA


## పరిశుభ్రత పాటించని ఫుడ్ కోర్ట్‌కు జరిమానా

బొడ్రాయిబజార్, జూలై 13 : జిల్లా కేంద్రంలోని పాత జాతీయ రహదారిపై హెడ్ పోస్టాఫీసు ప్రాంతంలోని రాయల్ ఫుడ్ కోర్టు పరిసరాలు, లోపల అపరిశుభ్రంగా ఉండడంతో యజమాని జానీపాషాకు మున్సిపల్ కమిషనర్ రూ.5వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో హోటల్ యాజమాన్యం, పెట్టి వెండర్స్ తమ పరిసరాలను, కిచెన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిల్వ ఉంచిన, పాడైపోయిన పదార్థాలను వాడితే హోటళ్లను సీజ్ చేసి, భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, బూర సతీశ్, హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేశ్, జవాన్‌లు మొల్కలపల్లి పరశురాములు, పిడమర్తి ప్రసాద్, దండు ఉపేందర్, జి.మల్లేశ్ ఉన్నారు.



హోటల్ యజమానికి రూ.5వేల జరిమానా విధిస్తున్న కమిషనర్ బి.శ్రీనివాస్

## ఆర్టీసీ బలోపేతానికి పటిష్ట చర్యలు

- దసరా నాటికి ఉమ్మడి జిల్లాకు 30 డీలక్స్, 30 ఎక్స్‌ప్రెస్ బస్సులు
- నల్లగొండ నుంచి తిరుపతి, హైదరాబాద్‌కు ఏసీ బస్సులు
- మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ సిటీ, జూలై 13 : నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. నల్లగొండ డిపోలో నూతన ఏసీ బస్సుతోపాటు 4 డీలక్స్, పల్లె వెలుగు బస్సులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను, కార్మికులను సంరక్షించేందుకు తమ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోపే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని తెలిపారు. కొత్తగా వెయ్యి బస్సులు కొనుగోలు చేశామని, మరో 1500 సర్వీసులను కొనుగోలు చేసేందుకు ఆర్డర్ ఇచ్చామని చెప్పారు. వచ్చే దసరా నాటికి జిల్లాకు 30 డీలక్స్, 30 ఎక్స్‌ప్రెస్ బస్సులను మంజూరు చేస్తామన్నారు. నల్లగొండ నుంచి హైదరాబాద్, తిరుపతికి ఏసీ బస్సులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఏడు డిపోల పరిధిలో 645 బస్సులు 2.55లక్షల కిలోమీటర్లు ప్రయాణించి 3లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరుస్తున్నాయన్నారు. ఆర్టీసీలో 3,035 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సులు నడుపాలని నిర్ణయం తీసుకున్నామని, అవసరమైతే అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రాజధానికి ఏసీ బస్సులను నడుపుతామని, ముందుగా జిల్లా కేంద్రాల నుంచి ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. నార్కట్‌పల్లి డిపోకు పునర్వైభవం తీసుకొచ్చి అక్కడి నుంచి అన్ని ప్రాంతాలకు బస్సులను పునరుద్ధరించే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ కార్మికులకు 21శాతం డీఏ ఇచ్చామని, రూ.280 కోట్ల బకాయిలలో 80 కోట్ల రూపాయలు ఇది వరకే ఇచ్చామని, మిగిలిన రూ.200 కోట్లు ఈ నెల చివరి నాటికి వారి ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత అతి పెద్ద జిల్లా అయిన నల్లగొండకు 25 బస్సులతోపాటు నార్కట్‌పల్లి డిపోకు పునర్వైభవం తీసుకురావాలన్నారు. ఉమ్మడి జిల్లాకు వంద బస్సులు మంజూరు చేయాలని మంత్రి పొన్నంను కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్రం, ఆర్టీసీ ఆర్‌ఎం రాజశేఖర్, డీఎం రామ్మోహన్‌రెడ్డి, డీవీఎం మాధవి, శివశంకర్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఎక్స్‌ప్రెస్‌కు రంగులేసి డీలక్స్ చేశారు!

మహాలక్ష్మి పథకానికి తూట్లు

నల్లగొండ సిటీ, జూలై 13 : నిత్యం ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ అధికారులు మహాలక్ష్మి పథకానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నారు. నల్లగొండ ఆర్టీసీ డిపోలో శనివారం రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించిన బస్సులు పాతవే. కాగా.. వాటికి రంగులద్ది కొత్తవిగా కలరింగ్ ఇచ్చారు. పాత ఎక్స్‌ప్రెస్ బస్సులకు డీలక్స్ రంగు వేసి ప్రారంభోత్సవం చేశారు. మరో వైపు తెలంగాణలోని ఓ డిపోలో నిర్వహణ లేని రాజధాని బస్సుకు సైతం కొత్త రంగు వేసి నల్లగొండ – హైదరాబాద్ మార్గంలో నడిపేందుకు ప్రారంభించారు. ఆ డీలక్స్ బస్సులోని రంధ్రాలు, సీట్లను చూసి ప్రయాణికులు అవాక్కయ్యారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామని చెప్తున్న కాంగ్రెస్ సర్కార్.. పాత టీఎస్ నెంబర్ ప్లేట్లు ఉన్న బస్సులను టీజీగా మార్చి ప్రారంభోత్సవం చేయడం గమనార్హం.



డీలక్స్ బస్సులో మామూలు సీట్లు, రంధ్రం

# బదిలీ సంతోషం.. అప్పుల భయం

## బెదిరింపులు తాళలేక పంచాయతీల్లో పనులు

సూర్యాపేట నియోజకవర్గం పరిధిలోని ఓ గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ పాడైతే అధికారులెవరూ పట్టించుకోలేదు. తాగునీటి కోసం గ్రామస్తులు గగ్గోలు పెడితే సమస్య వెంటనే పరిష్కారం కావాలని ఆ గ్రామపంచాయతీ కార్యదర్శికి పైనుంచి బెదిరింపులు.. ఆదేశాలు వచ్చాయి. తట్టుకోలేక తన భార్య పుస్తెల తాడు తాకట్టు పెట్టి సుమారు రూ.45వేలతో మరమ్మతులు చేయించాడు. ఇది జరిగి ఐదారు నెలలు అవుతున్నా.. ఇప్పటికీ బిల్లు రాలేదు. ప్రభుత్వం కల్పించిన బదిలీ అవకాశంలో ఆయన మరో చోటుకు వెళితే చేసిన అప్పులు ఎవరు ఇస్తారు? పుస్తెల తాడు కోసం భార్య చేస్తున్న గొడవను ఎవరు తీర్చుతారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇలా అప్పులు చేసి తిప్పలు పడుతున్న పంచాయతీ సెక్రెటరీల పరిస్థితి జిల్లాలో అనేకం.

– సూర్యాపేట, జూలై 13 (నమస్తే తెలంగాణ)

- వివిధ పనుల కోసం అప్పులు చేసిన కార్యదర్శులు
- జిల్లా వ్యాప్తంగా ఒక్కొక్కరు 50వేల నుంచి రూ.3లక్షల వరకు అప్పు చేసిన వైనం
- ఆరు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు బంద్
- బదిలీ అయితే చేసిన అప్పుల పరిస్థితి ఏంటి అంటున్న సెక్రెటరీలు




రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన బదిలీల అవకాశంతో ఎప్పటి నుంచో ట్రాన్స్‌ఫర్ కావాలనుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు ఓ పక్క సంతోషంగా ఉండగా.. ఆయా గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం సొంతంగా చేసిన అప్పులు ఎప్పుడు, ఎవరు ఇస్తారో తెలియని దుస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సెంట్రల్, స్టేట్ నిధులు రాలేదు. దీంతో సర్పంచుల కాలపరిమితి ముగిసిన నాటి నుంచి గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలి. లేదంటే చర్యలు తప్పవంటూ పై అధికారుల నుంచి బెదిరింపులు.. హెచ్చరికలు వస్తుంటే తట్టుకోలేక అప్పులు చేయాల్సి వచ్చిందని పలువురు పంచాయతీ సెక్రెటరీలు చెబుతున్నారు. ఇప్పటికే మాజీ సర్పంచులకు ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వకపోవడంతో ఆందోళనలు చేస్తుండగా.. గ్రామ పంచాయతీ అవసరాల నిమిత్తం రూ.50వేల నుంచి 3లక్షల రూపాయల వరకు సెక్రెటరీలు అప్పులు చేసి పనులు చేశారు. ఇప్పుడు తాము బదిలీపై వెళ్తే ఆ డబ్బులు ఎలా అని మనోవేదనకు గురవుతున్నారు.

పల్లెలే ప్రగతికి సోపానాలు. అవి బాగుపడితేనే దేశం బాగుపడుతుందని నమ్మిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన తొమ్మిదిన్నరేండ్ల పాలనలో వ్యవసాయం మొదలుకుంటే అనుబంధ వృత్తులకు ఊతం ఇచ్చేలా వేల కోట్లు వెచ్చించారు. కేంద్రం నుంచి గ్రామపంచాయతీలకు నిధులు వచ్చినా, రాకున్నా నెలనెలా కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఫలితంగా పల్లెలు ఆహ్లాదకరంగా రూపుదిద్దుకున్నాయి. అయితే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆరు నెలలుగా పల్లెలకు అటు కేంద్రం గానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ నయాపైసా విదిల్చ లేదు. ఫిబ్రవరి నుంచి సర్పంచులు పోయి ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది కానీ.. పనులు చేపట్టేందుకు నిధులు రావడం లేదు. దీంతో బీఆర్‌ఎస్ హయాంలో వచ్చిన నిధులతో ముమ్మరంగా పనులు చేయించిన పంచాయతీ కార్యదర్శులు.. ఇప్పుడు చిన్న చిన్న పనులు కూడా చేయలేని పరిస్థితి నెలకొంది.

### పైనుంచి బెదిరింపులు.. విధిలేక అప్పులు

సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తరువాత పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పడింది. గ్రామాల్లో తరచూ తాగునీటి బోర్లు కాలిపోవడం, పైపులైన్ల మరమ్మతులు, గేట్‌వాల్వ్ మార్చడం, పారిశుధ్య పనులు, వాటర్ ప్లాంట్ల మరమ్మతులు ఇలా అనేక పనులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించి చేతులు దులుపుకున్నది. పంచాయతీలకు మాత్రం నయాపైసా ఇవ్వడం లేదు. దీంతో సమస్యలపై ప్రజల నుంచి ఒత్తిడి పెరుగడం, కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలి.. నిధులు తరువాత పంపిస్తామంటూ అధికారులు పంచాయతీ సెక్రెటరీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో సెక్రటరీలు తమకు వచ్చే వేతనాలతోపాటు ఇతరుల నుంచి అప్పులు చేసి పనులు చేస్తూ వస్తున్నారు. ఇలా ఆయా పంచాయతీల్లో సెక్రెటరీలు చేసిన అప్పులు చిన్న, పెద్ద పంచాయతీల్లో రూ.50 వేల నుంచి రూ.3లక్షల వరకు జిల్లా వ్యాప్తంగా రూ.50లక్షలకు పైగా ఉన్నట్లు సమాచారం. అయితే.. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బదిలీలకు జీఓ తీసుకురావడంతో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న పంచాయతీ సెక్రెటరీలు తమ అర్హతను బట్టి ఎక్కడికి వెళ్లాలో వెతుక్కునే పనిలో పడ్డారు. మరోపక్క బదిలీ అయితే తాము చేసిన అప్పులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు సెక్రెటరీలు మదన పడుతున్నారు. రెండు నెలల క్రితం డిస్ట్రిక్ మినరల్ ఫండ్ నుంచి నిధులు ఇస్తామని అధికారులు నమ్మబలికారని, దీంతో ఎక్కడా పెండింగ్ లేకుండా పనులు చేయగా ఇప్పటి వరకు అతీగతీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఏదో ఒక నిధులతో తమ బాకీలు తీర్చాలని వేడుకుంటున్నారు. ఫిబ్రవరిలో పదవీ కాలం పూర్తయినప్పటికీ లక్షల్లో బాకీలు ఉన్న సర్పంచులు ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నా బిల్లులు ఇవ్వకపోగా నేడు సెక్రెటరీలకు ఇస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు డబ్బులు వెచ్చించి పనులు చేసింది వాస్తవమేనని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌కుమార్ అన్నారు. వారి డబ్బులు ఎక్కడికీ పోవని, చేసిన పనులకు సంబంధించి బిల్లులు చేసి సబ్‌మిట్ చేస్తే వస్తాయని చెప్పున్నారు.

# వాన జాడేది?

## జిల్లాలో ఎక్కడా కానరాని వర్షాలు

- ఆరు మండలాల్లో లోటు వర్షపాతం
- ఆత్మకూరు (ఎం)లో 61శాతం లోటు
- మండలాల్లో పెరుగని భూగర్భ జలాలు
- చాలా చోట్ల మొలకెత్తని విత్తనాలు.. ఆందోళనలో అన్నదాత
- కప్పలకు పెళ్లిళ్లు, కాముడు ఆటలు, బతుకమ్మలు
- వరుణుడా కరుణ చూపాలంటూ అంతటా పూజలు

వరుణుడు కరుణ చూపడం లేదు. వారాలు గడుస్తున్నా జిల్లాలో వానలు పడటం లేదు. జిల్లా వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు(ఎం)లో అత్యంత లోటు వర్షపాతం ఉన్నది. భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేసేదేమీ లేక వరుణ దేవా కరుణించు అని వివిధ రకాల పద్ధతుల్లో పూజలు చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, జూలై 13 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో ఈ సీజన్‌లో 151.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 132.9 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే రికార్డయ్యింది. ఆత్మకూరు (ఎం) మండలంలో 61శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. బీబీనగర్, చౌటుప్పల్, రామన్నపేట, అడ్డగూడూరు, గుండాల మండలాల్లో లోటు వర్షపాతం రికార్డయ్యింది. ఇక రాజాపేట, ఆలేరు, మోటకొండూరు, యాదగిరిగుట్ట, నారాయణపురం, మోత్కూరులో లోటు వర్షపాతానికి అతి దగ్గరలో ఉన్నాయి. తుర్కపల్లి, భువనగిరిలో మాత్రం కాస్త ఆశించిన స్థాయిలో వర్షాలు పడ్డాయని లెక్కలు చెబుతున్నాయి.



చౌటుప్పల్ : తంగడపల్లిలో వానలు లేక ఎదుగుదల లేని పత్తి పంట

### 11వేల ఎకరాల్లో ఎదుగుదల లేని పత్తి

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం వ్యాప్తంగా 11వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. కొన్ని చోట్ల మొల్కలు వచ్చినా చేను ఎదుగుదల అనుకున్న స్థాయిలో కనిపించడం లేదు. మొల్కలు వచ్చిన దగ్గర తేమ శాతం లేక ఆరిపోతున్నాయి. దాదాపు మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నది. దాంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షల పెట్టుబడులు భూమిలో పోసి వరుణుడి రాక కోసం ప్రతినిత్యం వేచిచూస్తున్నారు. ఇప్పటికి కూడా వర్షాలు పడితే మొల్క రాని దగ్గర తిరిగి నాటేందుకు వెయ్యికండ్లతో చూస్తున్నారు. ఇలానే మరో కొన్ని రోజులపాటు వరుణుడు కరుణించకపోతే అంతే సంగతులు. వరుణుడు కరుణించాలని కొన్ని గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శివాలయాల్లో జలభిషేకాలు నిర్వహించారు.

### మొలకెత్తని విత్తనాలు.. ఆందోళనలో రైతులు

వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులు సాగు పనుల్లో బిజీ అయ్యారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4,59,850 ఎకరాల్లో సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 2,85,000 ఎకరాల్లో వరి, 1,35,000 ఎకరాల్లో పత్తి, 8500 ఎకరాల్లో పప్పు గింజలు, 200 ఎకరాల్లో మిల్లెట్లు, 150 ఎకరాల్లో ఆయిల్ సీడ్స్, 21వేల ఎకరాల్లో ఇతర పంటలు వేసే అవకాశం ఉందని భావించింది. ఇంత వరకు బాగానే ఉన్నా వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు ఆలస్యం కావడంతో సీజన్ ఏవిధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి, భూములను సిద్ధం చేసుకొని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. మరికొన్ని చోట్ల విత్తనాలు వేసిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. వర్షాలు ఆలస్యమై విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేదు.

**వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)**

| మండలం | సాధారణం | నమోదైంది | లోటు వర్షపాతం |
|---|---|---|---|
| ఆత్మకూర్ (ఎం) | 144.2 | 56.1 | 61శాతం |
| చౌటుప్పల్ | 134.9 | 88.8 | 34శాతం |
| గుండాల | 173.5 | 115.4 | 33శాతం |
| అడ్డగూడూరు | 172.1 | 122.9 | 29శాతం |
| రామన్నపేట | 152.2 | 115.9 | 24శాతం |
| బీబీనగర్ | 162.5 | 127.9 | 21శాతం |

### వరుణదేవా కరుణించు..

రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా ముందుకు సాగడంలేదు. వర్షాలు లేకపోవడంతో మొక్కలు నాటేందుకు ఆసక్తి చూపించడంలేదు. జిల్లాలో ఒకటి, రెండు చోట్ల మినహా వన మహోత్సవం ఊపందుకోలేదు. మరో వైపు వర్షాల కోసం ప్రజలు వరుణుడిని వేడుకుంటున్నారు. బొడ్రాయిలకు జలాభిషేకాలు చేస్తున్నారు. కప్పలకు పెళ్లిళ్లు చేస్తున్నారు. వర్షాలు పడాలని కాముడు, బతుకమ్మ ఆడుతున్నారు. ఇటీవల జిల్లాలోని పలు మండలాల్లో వరుసగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుండటం కనిపించింది. పందేండ్ల తర్వాత వర్షాలు లేవని, కరువుఛాయలు కనిపిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

# 140 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్ట్.. పరారీలో నలుగురు

మిర్యాలగూడ, జూలై 13 : మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం పోలీసులు రూ.35లక్షలు విలువ చేసే 140.585 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ నెల 12న మిర్యాలగూడ పట్టణ శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మహేంద్ర బొలేరోతోపాటు మహేంద్ర మేరాజో వాహనాలను తనిఖీ చేసే క్రమంలో అందులో ఉన్న నలుగురు పోలీసులను చూసి పారిపోతుండగా ఒకరిని పట్టుకున్నారు. వాహనాల్లో తనిఖీ చేయగా 140.585 కిలోల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన భూక్యా రామును విచారించగా సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలానికి చెందిన నూనావత్ జగన్, నూనావత్ మంద్యానాయక్ సూచనల మేరకు ఒక వాహనం హైదరాబాద్ నుంచి, మరో వాహనం సూర్యాపేట నుంచి దేవరకొండ ప్రాంతంలో మద్దిమడుగు వెళ్లే దారిలో నిర్జన ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు సరఫరా చేసిన గంజాయిని లోడ్ చేసుకొని రవాణా చేస్తున్నట్లు తెలిపాడు. గంజాయి రవాణాలో సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలానికి చెందిన మరి కొంతమంది ఉన్నట్లు తెలిపాడు. కాగా, పెన్‌పహాడ్ మండలం బంజారాహిల్స్‌కు చెందిన నూనావత్ జగన్, జలమాల్‌కుంట తండాకు చెందిన నూనావత్ మంచ్యానాయక్, లాల్‌సింగ్‌తండాకు చెందిన ఆంగోతు నాగరాజు, ఖమ్మం జిల్లా జుబ్లీపురాకు చెందిన బానోతు సాయిలు పరారీలో ఉండగా పెన్‌పహాడ్ మండలం లాల్‌సింగ్‌తండాకు చెందిన భూక్యా రామును పోలీసులు అరెస్ట్ చేశారు. వీరందరిపై కేసు నమోదు చేసి పట్టుబడిన గంజాయిని, రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచామని, వాటి రవాణా, వినియోగాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలు, సేవించే వారి గురించి తెలిస్తే 100 ద్వారా లేదా నేరుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పోలీసులకు సహకరించి మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో అందరూ పాలుపంచుకోవాలని కోరారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో గంజాయిని, నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వన్ టౌన్ సీఐ సుధాకర్‌ను, హాలియా సీఐ జనార్దన్, హాలియా ఎస్‌ఐ సతీశ్, మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్‌ఐ రవి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.




వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

## సమీకృత మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలి

- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన




మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలని నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

భువనగిరి అర్బన్, జూలై 13 : భువనగిరి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి హయాంలో రూ.8 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ అన్నారు. మార్కెట్ వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం వీధి వ్యాపారుల కోసం సమీకృత మార్కెట్‌ను పూర్తి స్థాయిలో నిర్మాణం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా నిర్మాణం పూర్తయిన మార్కెట్ ప్రారంభానికి నోచుకోలేదని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారిస్తలేరని, ఇప్పటికైనా సమీకృత మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చి వీధి వ్యాపారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొలుపుల అమరేందర్, ఎన్నబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, పెంట నర్సింహ, అతికం లక్ష్మీనారాయణగౌడ్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, చెన్న మహేశ్ పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమ ప్రదాత మాజీ ఎమ్మెల్యే కిశోర్

- బీఆర్‌ఎస్‌కేవీ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యనారాయణ
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే కిశోర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే కిశోర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్‌కేవీ నాయకులు

తుంగతుర్తి, జూలై 13 : అసంఘటితంగా ఉన్న కార్మికులను సంఘటితం చేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కార్మిక సంక్షేమ ప్రదాత అని బీఆర్‌ఎస్‌కేవీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌడిచర్ల సత్యనారాయణ అన్నారు. మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ఆర్థిక సహకారంతో వంద మంది కార్మికులకు చేసిన లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం సంఘం జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. వందలాది మంది కార్మికులకు తన సొంత ఖర్చుతో లేబర్ ఇన్సూరెన్స్ చేయించారన్నారు. వారు అందించిన లేబర్ ఇన్సూరెన్స్ కార్డుల ప్రతిఫలం నేడు లబ్ధిదారులకు రూ.9లక్షల ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. అలాగే, రోడ్డు ప్రమాదంలో మరణించిన మరో నలుగురు డ్రైవర్ల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున, ముగ్గురు నిర్మాణ రంగ కార్మికులకు రూ.18.9 లక్షలు అతిత్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కేవీ మండల ఉపాధ్యక్షుడు కూరపాటి సోమేశ్, గుగులోతు వీరు నాయక్, గుగులోతు రవి, రాజేశ్, వెంకన్న, జయమ్మ, ముత్తయ్య, రమణమ్మ, సుజాత, అభినవ్, రామచంద్రు పాల్గొన్నారు.